ప్యాచ్‌లు ఇంకెన్నాళ్లు..?



రహదారిపై గుంతలు పడి కంకర తేలిన చోట వేసిన ప్యాచ్‌లు

అభివృద్ధికి నోచుకోని చెరువుబజార్ - మమత రోడ్డు

- అధ్వానంగా మారిన అరకిలోమీటర్
- గుంతలు పడి.. కంకర తేలి..
- ప్యాచ్‌లతో సరిపెడుతున్న పాలకులు
- గతుకులతో పాడవుతున్న వాహనాలు
- ఎవరికీ పట్టని అనాథలా రోడ్డు

ఖమ్మంవన్‌టౌన్: లకారం ట్యాంక్‌బండ్ కింద భాగం కావడంతో గట్టిగా పదికాలాల పాటు ఉండేలా అరకిలోమీటర్ పొడవున్న చెరువుబజార్ రోడ్డును సీసీ రహదారిగా నిర్మించారు. అప్పటి నుంచి నేటికీ పాలకులు పట్టనట్లు వ్యవహరించడంతో కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. దీనిపై అనేక ప్యాచ్‌లు వేయడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

> నగరంలోని చెరువుబజార్ నుంచి మమత రోడ్డు వరకు అర కిలోమీటర్ పొడవున్న రోడ్డు రెండు టౌన్‌లను కలిపే దగ్గర రహదారి. ఎప్పుడో ఖమ్మం మున్సిపాలిటీగా ఉన్నప్పుడు దీన్ని వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఖమ్మం మున్సిపాలిటీ నుంచి నగరపాలకంగా అభివృద్ధి చెందినా.. దీన్ని పట్టించుకున్న నాథుడే లేడు. గత పాలకుల కాలంలో వీఐపీలు సైతం ఈ మార్గంలో నిత్యం ప్రయాణించినా.. ఎవరూ పట్టించుకోలేదు. దీంతో నేటికీ ఎవరికీ పట్టని అనాథలా మిగిలింది.

నగరంలో రెండో అతిపెద్ద రహదారి..

నగరంలో ఉన్న ఏకైక ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఎస్‌బీఐటీ, హార్వెస్ట్, శ్రీచైతన్య లాంటి ప్రతిష్టాత్మకమైన వైద్య, విద్యాసంస్థలతో పాటు అటు గాంధీ చౌక్, శ్రీనివాసనగర్, చెరువుబజార్, పాకబండ బజార్, పాత బస్టాండ్‌ల నుంచి వచ్చే వారికి ఈ రోడ్డే ప్రధానం కావడంతో నగరంలో ఇది రెండో అతి ప్రధాన రహదారి. ఇది దగ్గర దారి కూడా. కానీ దీన్ని అభివృద్ధి చేయడంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించగా.. నేడు నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, కార్లు తిరుగుతుండడంతో గతుకులు ఎక్కువై వాహనాలు పాడవుతున్నాయి.

అనారోగ్య సమస్యలు..

ఈ రోడ్డులో ప్రయాణిస్తే అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో మెడ, భుజం, చేతులతో పాటు నడుము నొప్పులు సైతం వస్తున్నాయని, వైద్యుల వద్దకు వెళ్తే ఆ రోడ్డులో ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచిస్తున్నారని వాపోతున్నారు. దీంతో చేసేదేమి లేక ఇల్లెందు క్రాస్ రోడ్డు, కోర్టు మీదుగా మమత రోడ్డుకు చేరుకుంటున్నారు. కిలోమీటర్లకు పైగా ప్రయాణ దూరంతో పాటు సమయం కూడా పెరుగుతుందని, వెంటనే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించలేం..



ఈ రోడ్డులో ప్రతి రోజూ ప్రయాణించడం చాలా ఇబ్బందిగా ఉంది. ఉదయం పాఠశాలకు పిల్లలను దింపేందుకు ఈ మార్గం దగ్గర కావడంతో ప్రయాణించాల్సి వస్తుంది. కంకర తేలడంతో వాహనాలు సైతం పాడవుతున్నాయి. పాలకులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

– దిలీప్, వాహనదారుడు

సర్వాయి పాపన్న ఆశయాలు సాధించాలి

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడులో కల్లు గీత కార్మిక సంఘం అమరుల యాదిలో భాగంగా శుక్రవారం సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కొండం కరుణాకర్ ఆధ్వర్యాన అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జమీందారులు, జాగీర్దారుల అరాచకాలను సహించలేక బహుజనుల కోసం పోరాడిన మహనీయుడు పాపన్న అని కొనియాడారు. కుల, మత, జాతి, వర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడని, ఆయన ఆశయ సాధనకోసం గౌడ సామాజిక వర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సత్యనారాయణ, జి.అంజయ్య, పుల్లారావు, వెంకటేశ్వర్లు, సీహెచ్.సంగయ్య, ఎం.ఉపేందర్, టి.రవి,రామయ్య పాల్గొన్నారు.



పాపన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



రఘునాథపాలెం స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

నేలకొండపల్లి/రఘునాథపాలెం: హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లు, సంఘ నాయకులకు శుక్రవారం పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ వెళ్లకుండా మార్గమధ్యలో అడ్డుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో నేలకొండపల్లి, రఘునాథపాలెం సర్పంచ్‌ల సంఘం మండలాల మాజీ అధ్యక్షులు గండు సతీష్, మాధంశెట్టి హరిప్రసాద్, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, చెరుకూరి ప్రదీప్, కొర్లపాటి రామారావు, ఎస్‌కె.మీరా, గుగులోత్ మోతిలాల్, ధరవత్ పాండు తదితరులు ఉన్నారు. పెండింగ్ బిల్లులు ఇచ్చిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కామేపల్లి: ముచ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కామేపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యాన అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడే పుట్టినబిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతేకాక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.



రఘునాథపాలెంలో ర్యాలీ తీస్తున్న దృశ్యం

- **రఘునాథపాలెం:** తల్లి పాలతోనే బిడ్డలకు ఆరోగ్య రక్ష అని ఐసీడీఏస్ సూపర్‌వైజర్ బి.వెంకటమ్మ పేర్కొన్నారు. రఘునాథపాలెం గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యాన ర్యాలీ తీశాక అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, వైద్యులు, ఏఎన్‌ఎం సక్కుబాయి, అంగన్‌వాడీ టీచర్లు నజీమా, లక్ష్మి, ఉప్పవాణి, కవిత, పార్వతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సత్యశీల

- **ఖమ్మంమయూరిసెంటర్:** తల్లిపాలతోనే పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీల సూపర్‌వైజర్ సత్యశీల అన్నారు. 48వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు తల్లిపాల నుంచి అందే పోషకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భార్గవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్/కూసుమంచి: ఖమ్మం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రార్ కార్యాలయంలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1గా టి.సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జనగామ నుంచి బదిలీపై ఇక్కడకు రాగా కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా జె.అరుణ విధుల్లో చేరారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా నరేందర్ వరంగల్‌కు, వర్ధన్నపేట నుంచి అరుణ ఇక్కడకు వచ్చారు. ఇక కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్‌గా ఎం.పద్మ బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం ఆర్‌ఓ నుంచి బదిలీపై ఆమె రాగా, ఇక్కడ పనిచేసిన జె.రామనర్సింహారావు బదిలీపై వరంగల్ వెళ్లారు.

- **ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శిగా సృజన్‌బాబు విధుల్లో చేరారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై రాగా.. ఖమ్మంలో పనిచేసిన బి.బజార్ ఏన్కూరు మార్కెట్‌కు బదిలీ అయ్యారు.
- **నేలకొండపల్లి:** నేలకొండపల్లి ఎస్సైగా పి.సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా ఉన్న టి.నాగరాజును కమిషనరేట్‌కు అటాచ్ చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. దీంతో ఖానాపురం హవేలీ ఎస్సైగా ఉన్న సంతోష్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.
- **ఖమ్మంవైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓగా డాక్టర్ కళావతిబాయి విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా మహబూబాబాద్ డీఎంహెచ్‌ఓగా ఉన్న ఆమెను ఖమ్మం కేటాయించారు. కోవిడ్‌కు ముందు కళావతిబాయి ఖమ్మం డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తించారు.
- **ఖమ్మంరూరల్:** సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె. శ్రీనివాసశర్మ బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయన ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు.
- ఖమ్మంరూరల్ మండలంలోని రెడ్డిపల్లిలో గల మారెమ్మతల్లి ఆలయ ఈఓగా కె.జగన్‌మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి బదిలీపై ఇక్కడకు రాగా.. అర్చకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ డీలర్‌ను మార్చండి

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంలో ప్రభుత్వ చౌక దుకాణ ఇన్‌చార్జ్ డీలర్‌ను వెంటనే మార్చాలని నేలకొండపల్లి మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇమ్రాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన డీలర్ జయమ్మ మృతి చెందడంతో 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న డీలర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యాన రెండు కి.మీ దూరంలో ఉన్న అప్పలనరసింహాపురం డీలర్‌కు ఇప్పించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా డీలర్‌ను మార్చకపోతే తహసీల్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య, కాంగ్రెస్ నాయకులు బోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల సమగ్రాభివృద్ధికే వర్గీకరణ



ఖమ్మం మామిళ్లగూడెం : ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కామేపల్లి : మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీల్లోని అన్ని కులాల సమగ్రాభివృద్ధికి వర్గీకరణ అవసరమని.. ఇందులో భాగంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకంగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కోటా రాంబాబు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ చేపట్టిన వర్గీకరణ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతు ఇస్తోందని చెప్పారు. కాగా, తీర్పు వెలువడిన వెంటనే వర్గీకరణ అమలుచేసి తీరుతామని ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు బొడ్డు బొందయ్య, వెంకటేశ్వరావు, ముత్తయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యాన శుక్రవారం జెడ్పీ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు బెల్లంకొండ శ్యామల, వీరస్వామి, వెంకయ్యబాబు, జంగం వెంకయ్య, గద్దల చంద్రయ్య, వంశీ, గురుమూర్తి, పొట్టి వెంకటేశ్, సుమన్, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

- **కామేపల్లి :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని, ఈ తీర్పుతో మాదిగల 30 ఏళ్ల న్యాయబద్ధమైన పోరాటం గెలిచినట్లయిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్ అన్నారు. ఈసందర్భంగా పండితాపురం, కొత్తలింగాలలో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించడమే కాక మంద కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు పగిడిపల్లి ప్రభాకర్, మామిడాల మోహన్‌రావు, గుండ్ల ఆనందరావు, మన్మథరావు, వెంకన్న, ఆడెపు భిక్షపతి, మంద రవి, ఉపేంద్ర పాల్గొన్నారు.
- **ఖమ్మంవన్‌టౌన్:** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకుడు, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక రాష్ట్ర చైర్మన్ వక్కలగడ్డ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఉద్యోగ, విద్య, ఉపాధి రంగాల్లోనే కాకు చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో వర్గీకరణ అమలు చేయాలని కోరారు.
- **తిరుమలాయపాలెం:** ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో త్వరగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. తిరుమలాయపాలెంలో శుక్రవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: మాదిగ కుల భవన నిర్మాణానికి తిరుమలాయపాలెంలో స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం మండల తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. మండలంలో 25 వేల జనాభా కలిగి ఉన్న మాదిగలకు స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతిరాల నాగభూషణం మాదిగ, పోలేపొంగు వెంకటేశ్వర్లు మాదిగ, గంట కృష్ణ, గుగ్గిల అశోక్, బాబు, కొమ్ము పూలే, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ



చెరువుమాధారం సొసైటీలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం, మంగాపురంతండాలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, సొసైటీలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రసీదు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని కంపెనీలకు సంబంధించిన వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి శిరీష, రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మంరూరల్/కామేపల్లి/తిరుమలాయపాలెం: ఈనెల 5వ తేదీ నుంచి ఆయా మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు తెలిపారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండల తహసీల్దార్ పి.రాంప్రసాద్ విలేకరులతో మాట్లాడగా.. కామేపల్లి, తిరుమలాయపాలెం తహసీల్దార్లు సుధాకర్, పీ.వీ.రామకృష్ణలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల్లోని అధికారులందరూ హాజరై దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్న నేపథ్యాన ప్రజలు నేరుగా దరఖాస్తు ఇవ్వొచ్చని సూచించారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టండి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జున సాగర్ కాల్వలతో సహా జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టుల పంటల కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది వర్షపాతం సానుకూలంగా ఉండడంతో జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉండకపోవచ్చని, ఆయకట్టు చివరి భూములకు నీరు అందేలా చూడాలన్నారు. మేజర్, మైనర్ కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి నీటిపారుదల కష్టంగా మారిందన్నారు. గతేడాది సాగునీటిని అందించలేకపోయిన భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా ఈసారైనా నీటిని విడుదల చేయాలని తెలిపారు. జిల్లా మంత్రులు, అధికార యంత్రాంగం చొరవ చూపి మరమ్మతులకు నిధులు విడుదల చేసి పనులు త్వరగా జరిగేలా చూడాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

పేరుకే హెచ్చరిక బోర్డులు..!



నగరంలోని 57వ డివిజన్ దోరేపల్లి పుల్లయ్య నగర్‌లో ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులు పేరుకే పరిమితమయ్యాయి. ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉంచొద్దని, యజమానులు శుభ్రం చేయించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు బోర్డు పెట్టారు. అయినా స్థల యజమానులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆ స్థలంలో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారి.. చెత్త మొక్కలు పెరిగినా శుభ్రం చేయించలేదు. బోర్డు పెట్టి వారాలు గడుస్తున్నా.. అధికారులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

విరాళాల సేకరణ

ఖమ్మంరూరల్: కేరళలో జరిగిన ప్రకృతి విపత్తులో సర్వం కోల్పోయిన ఆ రాష్ట్ర ప్రజల సహాయార్థం శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో సీపీఎం ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. అనంతరం సేకరించిన మొత్తం రూ.5,070లను జిల్లా పార్టీ కార్యాలయానికి అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రఘునాథపాలెం ఏఈ ఇందిరా ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

'గత ప్రభుత్వంలో అవినీతి పాలన'

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్లు కొనసాగిన బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయమేనని తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ కమిటీ సలహాదారుడిగా నియమితులైన జంజిరాల రాజేష్ విమర్శించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పగిస్తే కేసీఆర్ పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేపథ్యాన రైతుల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకుడు వెగ్గళం పాండురంగాచారి పాల్గొన్నారు.

'హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్'లో రెడ్ కలర్ డే



వేడుకలో పాల్గొన్న విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో శుక్రవారం రెడ్ కలర్ డే వేడుకలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ పి.రవిమారుత్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులంతా రెడ్ కలర్ దుస్తులు ధరించిఆకట్టుకోగా.. రంగుల ఆధారంగా వస్తువులను క్రమబద్ధీకరించడానికి, వర్గీకరించడానికి పిల్లలకు సహాయపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పార్వతీరెడ్డి, బి.రవిశంకర్‌లతో పాటు ఎం.ప్రీతి, వి.చందన, జె.యాకయ్య, ఇ.సంతోష్, వి.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముళ్ల ఘర్షణ

నేలకొండపల్లి: తండ్రి మృతి చెందడంతో ఆయనకు సంబంధించిన రేషన్ డీలర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో అన్నదమ్ముళ్ల మధ్య ఘర్షణ జరిగింది. మండలంలోని చెరువుమాధారానికి డీలర్ వెంకటనారాయణ ఏడాది క్రితం మృతి చెందాడు. ఆ పోస్టు కుమారులకు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించగా.. నలుగురిలో ఓ కుమారుడు వేణు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయమై చర్చించేందుకు నేలకొండపల్లిలో ఉంటున్న అన్న సత్యనారాయణ వద్దకు శుక్రవారం వెళ్లగా ఇరువురు మధ్య గొడవ జరగడంతో తనపై గొడ్డలితో దాడికి యత్నించాడని వేణు తెలిపారు. ఆపై ప్లాస్టిక్ స్టూల్‌తో తలపై బలంగా కొట్టటంతో గాయమైందని ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేత

ఖమ్మం మామిళ్లగూడెం: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజుయాదవ్ కలిశారు. శుక్రవారం ఢిల్లీలో దత్తాత్రేయను కలిసిన ఆయన జ్ఞాపిక అందజేశారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	64		20
కాకర	66	చుక్కకూర	3
బోడ కాకర	200		20
బీర	48	తోటకూర	3
దొండ	36		20
పొట్లకాయ	48	గోంగూర	5
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	44	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		30
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	50		25
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	